# అభ్యంతరం లేదు

"మేం సిద్ధంగా ఉన్నాం, మీరొస్తే బయలు దేరడమే తరవాయి; మా అభ్యంతరం లేదు." ఫోన్‌లో చెప్పారు మూర్తి గారు. ఆ ఫోన్ కాల్ కోసమే ఉదయం నుంచీ ఇంట్లో అందరం ఎదురు చూస్తున్నాం. "మరింక ఆలస్యం దేనికి? వెళ్ళి, వాళ్ళని తీసుకు రండి." చెప్పింది నీరజ.

డ్రస్ చేసుకుని ఉన్నానేమో, వెంటనే చెప్పులు వేసుకుని, ఆటో స్టేండుకి బయలు దేరాను. కుసుమని చూసుకో డానికి మూర్తి గారూ వాళ్ళూ వొస్తున్నారివాళ. పదిహేను యిరవై రోజుల నుంచీ ఈ సంబంధం గురించి ప్రయత్నాలు జరుగు తున్నాయి. వాళ్ళింటికి నీరజా , నేనూ ఒకటి రెండు సార్లు వెళ్ళి రావడం కూడా జరిగింది. మంచి సాంప్రదాయక కుటుంబంలాగే తోచింది. మూర్తి గారు జింక్‌లో పని చేసి, రిటైరయ్యేరు. దొండ పర్తిలో ఒక మోస్తరు ఇల్లు కూడా కట్టు కున్నారు. అయనకి ఇద్దరబ్బాయిలు; ఒక అమ్మాయి. అమ్మాయి యింకా చిన్నది. పెద్దబ్బాయి రవి పెళ్ళి కొడుకు. ఏదో ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. మంచి ఉద్యోగమే. జాతకాలు ముందే చూసుకోవడం, నచ్చడం జరిగింది అమ్మాయి ఫొటో మూర్తి గారింట్లో అందరూ చూసేరు. అందరికీ నచ్చి నట్లే వుంది. కట్న కానుకల గురించి ఏమంత పట్టింపులు లేవన్న భావం గతంలో మేము కలసిన రెండు పర్యాయాలూ మూర్తి గారు చూచాయగా వెలిబుచ్చేరు. మంచి సంబంధం, పిల్లా పిల్లాడూ ఒకరి కొకరు నచ్చితే చాలు; ఇక అభ్యంతర మేముంది?

ఆటో ఎక్కి నేరుగా మూర్తి గారూ వాళ్ళింటికి వెళ్ళాను. వాళ్ళంతా నా రాక కోసమే అన్నట్టుగా సిద్ధంగా ఎదురు చూస్తున్నారు. ఓ అయిదు నిమిషాలు కూర్చున్నాక, "మరింక బయలు దేరదామా?" అడిగేను. "ఓ యస్... నిరభ్యంతరంగా" నవ్వుతూ తలూపేరాయన. "ఉండండి, ఆటోలు తీసు కొస్తాను.. మూడు ఆటోలయితే సరి పోతాయా?" అడిగేను. "నో...నో.. మీరు కూర్చోండి, మా వాడు వెళ్ళి ఆటోలు తెస్తాడు... .ఆటో స్టేండు మా యింటికి దగ్గరే... నేనూ, నాభార్యా, కాక, మా రవీ, అదే, పెళ్ళి కొడుకూ... మా చిన్నమ్మాయి, మా అన్నయ్యా, వదినా బయలు దేరుతున్నాం...మీరు అలా కూచోండి..." అని, మూర్తి గారు వాళ్ళ అబ్బాయిని కేకేసి, ఆటోలు తెమ్మని పురమాయించేరు.

వెనక గది లోంచి ఓ అబ్బాయి వచ్చి, నమస్కరించి నన్ను విష్ చేసి, ఆటోలు తేడానికి వీధిలోకి వెళ్ళాడు. ఆ అబ్బాయిని పరిశీలనగా చూసి, సంతృప్తిగా తల పంకించేను. అబ్బాయి బాగానే ఉన్నాడు. ఒడ్డూ పొడుగూ, హుందాగా ఉన్నాడు. ముఖంలో మర్యాదా మప్పితం ఉట్టి పడుతోంది. కుసుమకి యీడూ జోడూ సరిగ్గా సరి పోతుంది. ఈ

సంబంధం కుదిరితే చాలు, అనుకుంటూ మనసులోనే దేవుడ్ని ప్రార్థించేను. నిజానికి మూర్తి గారి అబ్బాయిని నేను చూడటం యిదే మొదటి సారి. ఆ మాటకొస్తే మా యింట్లో ఎవరం కూడా చూడ లేదు. మేం వొచ్చి నప్పుడల్లా ఆఫీసుకో, లేదా కేంప్‌కో వెళ్ళి పోవడం జరిగింది. పెళ్ళి కొడుకు ఫొటో మాత్రం చూపించేరు. అదీ బస్ట్ ఫొటో. మా యింట్లో అందరికీ అబ్బాయి నచ్చేడు. ఆటోలు వచ్చేయి. ఈ లోగా మూర్తి గారు, వాళ్ళ అన్న గార్నీ, వదిన గార్నీ పరిచయం చేసారు.

"పదండి... పదండి...' అంటూ బయలు దేరారు మూర్తి గారు. "అన్నయ్యని రమ్మను రాఘవా!" అని ఆటోలు తెచ్చిన అబ్బాయితో చెప్పేరు మూర్తి గారు.నేను గతుక్కు మన్నాను. ఈ కుర్రాడు మూర్తి గారి రెండో అబ్బాయి అన్నమాట! బహుశా పోలికలు దగ్గరగా ఉండడం చేత పోల్చుకో లేక పోయేను కాబోలు... పెద్దబ్బాయిని ఫొటోలో చూడటమే కానీ ప్రత్యక్షంగా చూడనే లేదు కదా! సరే! దానిదేముంది! నాకు నవ్వొచ్చింది. ఆ అబ్బాయి వెళ్ళి, పెళ్ళి కొడుకుని పిల్చు కొచ్చేడు. మేడ గది లోంచి వస్తూన్న పెళ్ళి కొడుకుని చూస్తూనే నా ముఖం వెల వెల పోయింది. మెదడు మొద్దు బారి పోయింది. వెర్రి చూపులు చూస్తున్న వాడిలా ఉండి పోయేను. ఆ షాక్ నుండి తేరు కోక ముందే యాంత్రికంగా ఆటో ఎక్కాను. నేనూ, అ అబ్బాయి, అతని చెల్లెలు ఒక ఆటో. మిగతా వాళ్ళు తక్కిన రెండు ఆటోల్లో సర్దు కున్నారు. ఆటోలు బయలు దేరాయి.

నా గొంతు తడారి పోతోంది. గుండెలో ఎవరో చెయ్యి పెట్టి కెలికినట్టవుతోంది. ముఖం మీద చెమటలు మాటి మాటికీ తుడుచుకుంటున్నాను. ఎంత మోసం! మూర్తి గారి మీద పీకల వరకూ కోపం వచ్చింది. ఆటోలో నా శరీరం ఆ అబ్బాయి వొళ్ళు తాకి నప్పుడల్లా ఏవో తేళ్ళూ, జెర్రెలూ పాకుతున్నట్టుగా ఉంది. ఆ అబ్బాయి రెండు చేతులూ బాగా కురచగా ఉన్నాయి. బస్ట్ ఫొటోలో ఆ విషయం గమనించే వీలు లేకపోయింది. చూస్తూ చూస్తూ ఈ అంగ వికలుడికి కుసుమని కట్ట బెట్టడమా! నా మనసులో తిరస్కారం బుసలు కొట్టింది. ఈ సంబంధానికో నమస్కారం! అసలు ఆటోలు ఎక్కడానికి ముందే ఈ విషయం వాళ్ళ ముఖం మీద ఫెడీల్మని చెప్పెయ్యాల్సింది. అలా ముక్కు సూటిగా చెప్ప లేక పోయిన నా బలహీనత మీద నాకే కోపం ముంచుకొస్తోంది. ఆటోలో యిబ్బందిగా కదల సాగేను. ఆ అబ్బాయి మౌనంగా కూచుని ఉన్నాడు. మేం కలిసి నప్పుడు మూర్తి గారు ఎంత మర్యాదగా మాట్లాడేరు! అంతా వంచన. దగా! పెళ్ళి కొడుకు అంగ వైకల్యం గురించి దాచి, మాట మాత్రంగా నయినా కూడా దాని గురించి ప్రస్తావించ కుండా మోసం చేయాలని చూసేరు. నా మనసు ఉడికి పోతోంది.

'ఇక ఈ పెళ్ళి చూపుల తతంగం నామ మాత్రమేనని, నిశ్చయాని కొచ్చేను. ఛస్తే ఈ సంబంధం కుదిరేది కాదు. మొక్కు బడిగా ఈ తంతు ముగించి తర్వాత ఏదో కారణం చెప్పి వీళ్ళకో గుడ్ బై చెప్పేయాలి. ఈ నిర్ణయాని కొచ్చేక నా మనసు కాస్త కుదుట పడింది.

* * *

పెళ్ళి కొడుకుని చూస్తూనే ఇంట్లో వాళ్ళు ముఖాలు గంటు పెట్టు కున్నారు. వాళ్ళ ఉత్సాహం జావ కారి పోయింది. కొయ్య బొమ్మల్లా ఉండి పోయేరు. ఇంట్లో వాళ్ళని

పక్కకి పిలిచి, "ముందీ తంతు కానివ్వండి... తర్వాత మాట్లాడు కుందాం... ఈ సంబంధం కుదిరేది కాదు... ఈ విషయం ఇప్పుడు చెప్పడం బాగోదు కదా?" అని చెప్పేను. మతులు పోయిన వాళ్ళలా నీరజా వాళ్ళూ తలలూపేరు. యాంత్రికంగా ఆ తతంగం ముగిసింది. కాసేపు ఉన్నాక మూర్తి గారూ వాళ్ళూ వెళ్ళి పోయేరు. అప్పుడు యింట్లో వాళ్ళ నోళ్ళు పెగిల్చేరు. 'ఛ.. ఛ.. దిక్కు మాలిన సంబంధం.. అలాంటి వాడిని చేసుకునే గతి దీనికేం పట్టలేదు.. అయినా, సంబంధం చూసుకునేటప్పుడు ముందూ వెనుకా అన్నీ సరిగ్గా చూసుకో వద్దుట్రా! అమ్మ దులిపేస్తోంది. చివరికంతా "మీ సంబంధం అక్కర లేదని వెంటనే ఫోన్ చేసి చెప్పెయ్యండి." అని తీర్మానించేరు.

పాపం, కుసుమ చిన్న మనసు ఎంత గాయ పడిందో, ఏమో! బెరుగ్గా కుసుమ వేపు చూసేను. "అబ్బాయి నాకు నచ్చేడు నాన్నా! చాలా మంచి మనసు... నాకేం అభ్యంతరం లేదు. మీరు ఆలోచించు కోండి..." అంది, నెమ్మదిగానే, అయినా దృఢంగానే.

బాంబు పేలినట్టు అంతా అదిరి పోయేరు.

"నీకేమన్నా పిచ్చి పట్టిందేవిటే! అసలు అబ్బాయిని నువ్వు సరిగ్గా చూసేవా? చూసే యీ మాట అంటున్నావా!" అని అరిచేరంతా. కుసుమ తొణక్కుండా సౌమ్యంగా జవాబిచ్చింది: "చూసే అంటున్నాను... మీరు చూడని కోణంలో కూడా చూసే అవకాశం నాకతను కల్పించేడు. తన గురించీ, తన అంగ వైకల్యం గురించీ ముందుగానే తెలియ జేస్తూ నాకు ఉత్తరం రాసేడు. ఇంట్లో వాళ్ళు ఆ విషయం దాచినా, అతను దాచ లేదు. ఆలోచించు కొమ్మని కోరేడు. అంగ వైకల్యం అతని అపరాధం కాదు... ఒడ్డూ, పొడుగూ అందం చందం, హెూదా, పెద్ద ఉద్యోగం, ఆస్తీ పాస్తీ అన్నీ ఉండి కూడా – కుసంస్కారం అనే అంగ వైకల్యం కల వాళ్ళు లోకంలో ఎందరు లేరు! వాళ్ళతో పోల్చి చూస్తే నాకతని శారీరక లోపం ఆవగింజంత కూడా కనిపించడం లేదు... నా అభ్యంతరం లేదు... ఇక నిర్ణయం మీదే !" అంది నిబ్బరంగా. ఇలా మాట్లాడుతున్నది మా కుసుమేనా! అని ఓ క్షణం ఆశ్చర్య పోయేను.

"అది కాదమ్మా..." ఏదో చెప్ప బోయింది నీరజ. "క్షమించమ్మా! మీరీ సంబంధం వొద్దనుకోడానికి ముందు శాంతను మరిచి పోవడం ఆశ్చర్యంగా ఉంది... ఆలోచించండి,,," అంటూ తన గది లోకి వెళ్ళి పోయింది.

శాంత! మా రెండో అమ్మాయి! ఏదో చెప్పాలని, ఏమీ చెప్ప లేక నీళ్ళు నిండిన కళ్ళతో స్వర పేటిక కదిలిస్తోంది...

మూర్తి గారు మమ్మల్ని మోసం చేసారనే భావం నా మనసులోంచి ఇప్పుడు పూర్తిగా తుడిచి పెట్టుకు పోయింది.

మరింక – అభ్యంతరం ఏముంది కనుక! వాళ్ళకి మా సంబంధం నచ్చితే ఎంత బాగుంటుంది!

* * *

న్యూజెర్సీ కథల పోటీలో బహుమతి పొందిన కథ.

ఆంధ్రజ్యోతి, సచిత్ర వార పత్రిక 2-6-1995 సంచికలో ప్రచురణ.